క్లుప్తంగా

పాఠశాలలు తెరిచేసరికి అందుబాటులో కిట్లు



స్టాక్ పాయింట్ వద్ద వివరాలు ఆరా తీస్తున్న అబ్జర్వర్ చంద్రశేఖర్

పెద్దాపురం: ఈ ఏడాది విద్యా సంవత్సరానికి(2025–26) గాను పాఠశాలలు తెరిచేసరికి ఆయా మండల పాయింట్ వద్దకు స్టూడెంట్స్ కిట్లు అందుబాటులో ఉంటాయని విద్యాశాఖ పరిశీలకులు చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక రాజీవ్ కాలనీ యూపీ ప్రభుత్వ పాఠశాలలోని స్టాక్ పాయింట్‌ను ఆయన జిల్లా మొబలైజేషన్ ఆఫీసర్ చామంతి నాగేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అబ్జర్వర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్రకు సంబంధించిన అన్ని రకాల స్టూడెంట్స్ కిట్స్ సరఫరా ప్రారంభించామన్నారు. జూన్‌లో పాఠశాలలు తెరిచేసరికే ఆయా మండల పాయింట్లకు కిట్లు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏంఈఓలు చౌదరి, శర్మ, ప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: పట్టణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షత నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, ఆయా శాఖల మున్సిపల్ అధికారులు హాజరు కావాలన్నారు. పట్టణంలో నిర్వహించే అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై చర్చించడానికి 28 అంశాలతో అజెండాను రూపొందించారు.

ఎమ్మెల్యేకు సత్కారం

సామర్లకోట: నియోజకవర్గ పరిధిలోని పాస్టర్ల సంఘ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పను సత్కరించారు. సువార్త సేవలో కొనసాగుతున్న పాస్టర్లకు ఏడు నెలల ఆర్థిక సహాయం రూ.35వేలు చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ కావడంతో అచ్చంపేటలోని ఎమ్మెల్యే స్వగృహంలో పాస్టర్ల సంఘ ప్రతినిధులు కృతజ్ఞతగా సత్కరించారు.పాస్టర్ల సంఘ ప్రతినిధులు టి.బ్లెసింగ్, జి.జయబాబు, ఎ.చంటి, జె.జయరాజు, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన

బోట్‌క్లబ్: అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా స్థానిక సూర్యకళా మందిరంలో మంగళవారం శాస్త్రీయ నృత్య కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన నగర ప్రజలను ఎంతగానో అలరించింది. నాట్యాచార్య ఆనెం ప్రసాద్ ఆధ్వర్యంలో అంబికా, వైదేహి, లక్ష్మీశాంతి, జగజ్యోతి, కల్యాణి మాధవి, శ్రీదేవి శ్రీవాణి, హేమలత, సుచిత్ర, లక్ష్మీశాంతి, జగజ్యోతి, దుర్గారావు, ఆకాజ్యోతి వద్ద శిక్షణ తీసుకుంటున్న సుమారు 150 చిన్నారులుతో ఉదయం నుంచి రాత్రి వరకూ శాస్త్రయ నృత్యాలు చేశారు. అనంతరం భరతనాట్యం, కూచిపూడిలో డాక్టరేట్ పొందిన వసంత్ కిరణ్‌ను శాస్త్రీయ నృత్య కళాకారులు సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో సత్కరించి, నాట్య ఘృణి అవార్డు ప్రదానం చేశారు. అనంతరం వసంత్ కిరణ్ బృందంతో నిర్వహించిన నృత్య ప్రదర్శన నగర ప్రజలను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నాట్యాచార్య కృష్ణకుమార్, లింగమల్లు కృష్ణమూర్తి, భార్గవి రామకృష్ణ, ఈవీ కృష్ణమాచార్యులు, గణేష్, సుష్మ పాల్గొన్నారు.

సామర్లకోట అధికారుల ఫోన్ నంబర్లు

మున్సిపాలిటీ	
మున్సిపల్ కమిషనర్	98499 05808
మున్సిపల్ మేనేజర్	98499 07118
మున్సిపల్ డీఈ	96769 68282
మున్సిపల్ ఏఈ	98499 07122
మున్సిపల్ ఆర్వో	98499 07120
మున్సిపల్ ఆర్ఐ	90146 00920
మున్సిపల్ టీపీఓ	98499 07123
శానిటరీ ఇన్‌స్పెక్టర్	77024 48282
అకౌంట్స్ ఆఫీసర్	98499 02447
ప్రభుత్వాసుపత్రి	
సూపరింటెండెంట్	80082 88125
పశు సంవర్ధక శాఖ ఏడీ	94418 60299
తహసీల్దార్	98499 03876
ఎంఈఓ–1	85558 71069
ఎంఈఓ–2	94410 73418
ట్రాన్స్‌కో ఏడీఈ	94408 12600
ట్రాన్స్‌కో ఏఈ	94408 12634
ట్రాన్స్‌కో ఏఈ రూరల్	94408 12686

కొత్తపల్లి మండల అధికారులు

తహసీల్దార్	91542 47464
ఎంపీడీఓ	94401 13090
ఇంజినీర్	99890 78030
ఎలక్ట్రికల్ ఏఈ	94408 12642
హౌసింగ్ ఏఈ	70939 30455
ఈఓపీఆర్డీ	99489 27333
ఉపాధి హామీ పథకం ఏపీఓ	83744 46378
డ్వాక్రా ఏపీఎం	89788 81622
ఎస్సై	94409 00752
సీఐ పిఠాపురం	94407 96523
వ్యవసాయ శాఖ ఏఓ	83310 56594
కొత్తపల్లి పీహెచ్‌సీ డాక్టర్	99890 69546

నిధులు ఉన్నా.. నిర్లక్ష్యమెందుకో?

- ఏళ్లు గడుస్తున్నా నిర్మించని 23వ వార్డు రహదారి
- గ్యాస్ పైపులైన్ పేరుతో రోడ్డుకు తూట్లు
- బహిరంగ మరుగుదొడ్డిగా మారిన వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



పట్టణంలోని 23వ వార్డులో రాళ్లతో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి

సామర్లకోట: పట్టణంలోని 23వ వార్డు ప్రధాన రహదారిపై నిర్లక్ష్యం వహించడంపై సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. సుమారు తొమ్మిదేళ్ల క్రితం ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి సత్యనారాయణపురం వెళ్లే ప్రధాన రోడ్డులో గ్యాస్ పైపులైన్ ఏర్పాటు చేశారు. గ్యాస్ పైపులైన్‌కు సంబంధించి రోడ్డును తవ్వేశారు. దీంతో రోడ్డు గోతులతో నిండిపోయింది. అలాగే ఈ రోడ్డు బహిరంగ మరుగుదొడ్డిగా మారిపోయింది. ఆ రోడ్డుపై రాకపోకలు సాగించే మహిళలు ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 9 ఏళ్ల నుంచి రోడ్డు నిర్మాణంపై శ్రద్ధ చూపకపోవడంతో 23వ వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్యాస్ కంపెనీకి చెందిన ప్రతినిధులు రోడ్డుకు నష్ట పరిహారం చెల్లించిన్నట్టు మున్సిపల్ అధికారులు అంగీకరిస్తున్నారు. అయినా రోడ్డు నిర్మాణంపై ఎందుకు శ్రద్ధ చూపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యే నిధులు రూ.మూడు కోట్లు మున్సిపాలిటీకి కేటాయించడంతో ఆ నిధులలో 23వ వార్డుకు రూ.ఐదు లక్షలు కేటాయిస్తూ కౌన్సిల్ అజెండాలో పెట్టారు. ఆ నిధులతో 23వ వార్డుకు వెళ్లు ప్రధాన రోడ్డుకు కేటాయించాల్సి ఉండగా ఇరుకుగా ఉండే రోడ్డుకు కేటాయించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. నిధులు కేటాయించిన రోడ్డులో కారు వచ్చిన సమయంలో ఎదురుగా మోటారు సైకిలు వెళ్లితే తప్పించుకోవడానికి అవకాశం కూడా ఉండదనే వాదనలు ఉన్నాయి. 23వ వార్డు ప్రధాన రోడ్డులో రైల్వే ప్రధాన కార్యాలయ భవనాలు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. ఎఫ్‌సీఐ, ప్రభుత్వ పాఠశాల, కాన్వెంటు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, మాజేటినగర్‌కు ప్రతి రోజు వందలాది మంది రాకపోకలు సాగిస్తారు. అటువంటి ప్రధాన రోడ్డుకు నిధులు కేటాయించకపోవడంపై 23వ వార్డు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ పైపులైన్లకు తవ్విన గోతులు కారణంగా రోడ్డుపై రాళ్లు లేచిపోయి ఉన్నాయి. 22వ వార్డులోని మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలను 23వ వార్డులోని మున్సిపల్ పాఠశాలలోనికి విలీనం చేశారు. దీంతో ఆ ప్రాంత చిన్నారులు ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు చేస్తున్నారు. ఇంత ప్రాధాన్యం ఉన్న రోడ్డుపై ఎందుకు శ్రద్ధం చూపడం లేదో అర్థం కావడం లేదని సత్యనారాయణపురం ప్రజలు వాపోతున్నారు.

సులభంగా భవన నిర్మాణానికి అనుమతులు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో భవన నిర్మాణాలు వేగంగా అనుమతులు ఇవ్వనున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జీఓ 20 ప్రకారం మున్సిపాలిటీ పరిధిలో గుర్తింపు పొందిన లైసెన్సు సర్వేయర్లు వేసిన ప్లాన్ల ప్రకారం భవన నిర్మాణాలకు అనుమతి ఇస్తామన్నారు. అదే విధంగా గతంలో రోడ్లు విశాలంగా లేవని తిరస్కరించిన లేఅవుట్‌లలో సర్క్యులేషన్ ప్యాట్రన్‌లో అనుమతులు ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని ఇళ్ల నిర్మాణాలు చేసుకునే వారు మున్సిపల్ కార్యాలయంలో గాని, ఆన్‌లైన్‌లోగాని సంప్రదించాలన్నారు. అదే విధంగా మున్సిపాలిటీ పరిధిలో లైసెన్సు సర్వేయర్లుగా గుర్తింపు పొందడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఈ మేరకు ఐటీఐ, సివిల్, డిప్లమో, బిటెక్ సివిల్ పూర్తి చేసిన వారు అర్హు లన్నారు. వివరాలకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ హెల్ప్ డెస్క్ 9959212729కు సంప్ర దించాలన్నారు.

మంచినీరు వృథా!



ఇది మురికి నీరు కాదు కుళాయి నీరు (పిఠాపురం నుంచి మాధవపురం వెళ్లే మెయిన్‌రోడ్డులో పైపు లైన్ లీకేజీతో డ్రైన్‌లో పారుతున్న మంచినీరు)

పిఠాపురం: ఆధ్యాత్మిక కేంద్రమైన పిఠాపురం పట్టణంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి సమస్యలు అడుగుడుగా అద్దం పడుతున్నాయి. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మంచినీరు వృథాగా పోతోంది. మున్సిపాలిటీ రూ.కోట్లు ఖర్చుతో నిర్వహిస్తున్న మంచినీటి పథకం పైపులైన్ల లీకేజీలతో నీరు గారుతోంది. ఈ లీకుల వల్ల తాగునీరు కలుషితమవుతోంది. దీంతో పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఏకరవు పెడుతున్నా మున్సిపల్ అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంచినీటి పైపులైన్లు మురికి కాలువల్లో లీకై మంచినీరు కాస్త మురికి నీరుగా సరఫరా అవుతున్నా అధికారులు అటువైపు చూడడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.



ఇది వర్షపు నీరు కాదు కుళాయి నీరు (పిఠాపురం నుంచి మాధవపురం వెళ్లే మెయిన్ రోడ్డులో పైపులైన్ లీకేజీతో జలమయంగా మారిన రోడ్డు)



ఇది మురికి నీరు కాదు కుళాయి నీరు (పిఠాపురంలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి)

పాలిసెట్ పరీక్షలు ప్రతి ఒక్కరూ శ్రద్ధగా రాయాలి



కోచింగ్ ముగింపు సభలో ప్రసంగిస్తున్న సూరిబాబు రాజు

పెద్దాపురం: ప్రభుత్వ బుధవారం నిర్వహించే పాలిసెట్ పరీక్షలు విద్యార్థులు శ్రద్ధగా రాసి మంచి ఫలితాలు సాధించాలని పెద్దాపురం మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కోచింగ్ క్యాంపు ముగింపు సభ మంగళవారం బుద్ధా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సూరిబాబు రాజు మాట్లాడుతూ పాలిసెట్ ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠాలు నేర్పించిన బుద్ధా శ్రీనివాస్, నీలపాల బాల మురళికృష్ణలను సన్మానించారు. ఈకార్యక్రమంలో మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం అడ్మిన్ నరేష్ పెద్దిరెడ్డి, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి రవివర్మ, సిరిపురపు శ్రీనివాస్, గడిగట్ల సత్తిబాబు, రొంగల అరుణ్, అమృత నమ్రత తదితరులు పాల్గొన్నారు.

చివరకు చెత్త తీశారు..!

సాక్షి ఇంపాక్ట్



చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది (ఈ పని ఎప్పుడో చేయాలి)

పిఠాపురం: స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల ఆవరణలో గత 25వ తేదీన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రచ్చబండ నిర్వహించడానికి ఏర్పాట్లు చేసిన మున్సిపల్ అధికారులు రచ్చబండ రద్దు కావడంతో మూటాముళ్లు సర్దుకుని వెళ్లిపోయారు. ఈ ఏర్పాట్లలో వేసిన చెత్తను మాత్రం అక్కడే వదిలేశారు. నాలుగు రోజులైనా తొగించలేదు. దీంతో కళాశాలలో స్పోర్ట్సు క్యాంపులో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు, విద్యార్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. అయినా మున్సిపల్ సిబ్బంది పట్టించుకోలేదు. దీనిపై రచ్చబండను కాస్త రొచ్చుబండ చేశారని 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. చివరకు చెత్తను తొలగించారు.

ప్రజా సమస్యలను పట్టించుకోరా?

- ఆదాయ వనరులపై దృష్టి సారించండి
- మున్సిపల్ అధికారులపై కౌన్సిలర్ల ధ్వజం
- వాడివేడీగా పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



మున్సిపల్ సమావేశంలో అధికారులను నిలదీస్తున్న సీనియర్ కౌన్సిలర్ రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్

పెద్దాపురం: పట్టణంలో జరుగుతున్న డ్రైన్లు, సీసీ రోడ్డుల నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తున్నా పట్టించుకోరా..? పట్టణంలో ఆదాయ వనరులపై దృష్టి సారించరా? చలివేంద్రం నిర్వహణ ఉందా!, పట్టణంలో పందులు, కుక్కల బెడద ఉన్నా పట్టించుకోరా అంటూ పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు అధికారులపై ధ్వజమెత్తారు. పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, విడదాసరి రాజా మాట్లాడుతూ పట్టణంలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణం నాణ్యత లోపిస్తుందన్నారు. తీసిన మట్టినే వాడుతూ నాణ్యతలోపంతో నిర్మిస్తున్నా మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు చోద్యం చూస్తారా అని నిలదీశారు. కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయడంలో ఉన్న శ్రద్ధ రోడ్డు, డ్రైన్ల నిర్మాణాలు నాణ్యతపరంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీనియర్ కౌన్సిలర్ రాజశేఖర్ మాట్లాడుతూ చలివేంద్రాలు నిర్వహించాలని కౌన్సిల్‌లో తీర్మానిస్తే వాటి నిర్వహణ అంతంత మాత్రంగానే ఉందన్నారు. బిల్లులు రాసుకునే శ్రద్ధ ప్రజల దాహార్తిని తీర్చడంపైన చూపించాలన్నారు. పట్టణంలో ప్రధాన రహదారిలో సెంటర్ డివైడర్‌లో లైటింగ్, మొక్కల పెంపకంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆదాయ వనరులపై దృష్టి సారించాలన్నారు. కౌన్సిలర్ త్సలికి సత్య భాస్కర్ మాట్లాడుతూ అజెండా పూర్తిగా కాంట్రాక్టర్లు, వర్కులు తప్ప వాటి ఆచరణ కనబడడం లేదన్నారు. ఉన్న పనులు, చేపట్టిన పనులు పూర్తి చేయాల్సినబాధ్యత కాంట్రాక్టర్లపై ఉందన్నారు. స్థానిక శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ ఆకుల కృష్ణబాపూజీ మాట్లాడుతూ మున్సిపల్ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా చూడాలన్నారు. కౌన్సిలర్లు రాజశేఖర్, యర్రా శ్రీను, కనకదుర్గ మాట్లాడుతూ పట్టణంలో పందులు, కుక్కల బెడత ఎక్కువగా ఉందని, ప్రజలకు మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. అనంతరం పలు సమస్యలపై వాడివేడిగా చర్చ నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, డీఈ ప్రకాశరరావు, మేనేజర్ జ్యోతి రాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, కౌన్సిలర్లు ఆరెళ్ల వీరాఘవులు, పప్పల దుర్గారావు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, ఆయా విభాగాల అధికారులు, యాయా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోలీసు శాఖకు స్టాపర్ల అందజేత



ఆస్పత్రి బహూకరించిన స్టాపర్లను ప్రారంభిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ రూరల్: జిల్లాలో ప్రధాన రహదారుల్లో కూడళ్ల వద్ద ప్రమాదాల నివారణ కోసం వంద మొబైల్ ట్రాఫిక్ బారికేడ్లు (స్టాపర్స్)ను కాకినాడ మెడికవర్ ఆస్పత్రి యాజమాన్యం పోలీసు శాఖకు బహూకరించింది. అచ్చంపేట జంక్షన్ వద్ద ఆస్పత్రి ప్రాంగణంలో మంగళవారం ఉదయం వీటిని ఎస్పీ జి.బిందుమాధవ్‌కు మెడికవర్ ఆస్పత్రి యూనిట్ హెడ్ శుభాకరరావు అందజేయడంతో వాటిని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం రోడ్డు ప్రమాదాల నివారణకు, వాహనాల వేగం నియంత్రణకు, ట్రాఫిక్ రెగ్యులేషన్‌కు జిల్లా వ్యాప్తంగా వినియోగిస్తామని చెప్పారు. మెడికవర్ ఆస్పత్రి యూనిట్ హెడ్ శుభాకరరావు మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా పోలీసు శాఖకు 100 స్టాపర్స్‌ను సమకూర్చామని, ఆస్పత్రి ద్వారా తరచూ వైద్య శిబిరాలు నిర్వహించి పోలీసు సిబ్బందికి సేవలందిస్తున్నామన్నారు. అనంతరం ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసి ఉమెన్ అండ్ చైల్డ్ విభాగాన్ని వారు సందర్శించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, సీఐలు చైతన్య కృష్ణ, భగవాన్, ట్రాఫిక్ సీఐలు మురళీకృష్ణ, రామారావు, మెడికవర్ ఆస్పత్రి ఆపరేషన్స్ హెడ్ ఖాద్రి, మార్కెటింగ్ హెడ్ నాగరాజు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ సురేంద్ర



వేసవి శిక్షణా తరగతుల్లో ప్రసంగిస్తున్న పాలంకి నాగరాజు

పెద్దాపురం: గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం పుస్తక పఠనం, కథలు చదవడం నేర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలును వెలికి తీసేందుకు ఈ శిక్షణాతరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం తామరాడ స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ మెలకువలు తెలియజేయగా, కోటపాడు ప్రధానోపాధ్యాయులు రాళ్లపల్లి వెంకటేశ్వరరావు స్పోకెన్ ఇంగ్లిష్, గ్రామర్ నేర్పించారు. .ఈ కార్యక్రమంలో శ్రీదేవి, నారాయణ, కొత్త శివ, బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్రకారుడు రాజా రవివర్మ విగ్రహావిష్కరణ



చిత్రకారుడు రాజా రవివర్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ: వాల్మీకి రామాయణాన్ని చిత్ర రూపంలో పొందుపర్చిన దేశం గర్వించదగ్గ చిత్రకారుడు రాజా రవివర్మ విగ్రహాన్ని మంగళవారం ఆయన 177వ జయంతి సందర్భంగా కాకినాడ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఆవిష్కరించారు. ఎన్నో వైవిధ్యమైన చిత్రాలను ఆణిముత్యాలుగా మలిచిన గొప్ప చిత్రకారుడు రాజా రవివర్మ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టెక్నాలజీ లేని రోజుల్లో చిత్రలేఖనం ద్వారా ప్రపంచాన్ని అబ్బురపరచిన మహనీయుడు రాజా రవివర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు ఉలిశెట్టి విజయభాస్కర్, స్వరూప్, అధ్యక్షుడు తాతపూడి మాధవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి దేశ నలుమూలల నుంచి పలువురు కళాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లిపూడి వీరు, ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి సావ్వేటి భాస్కర్ నాయకులు నయమతుల్లా, గంటి నరేష్ పాల్గొన్నారు.

సారా కేసులో ఇద్దరి అరెస్టు

తుని: స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశామని సీఐ పట్టాభి చౌదరి మంగళవారం తెలిపారు. వారి తెలిపిన వివరాల ప్రకారం.. రౌతులపూడి మండలం రాఘవరానికి చెందిన దేవుడును అదుపులోకి తీసుకుని 40 లీటర్లు, కోటనందూరు మండలం కేఏ మల్లవరానికి చెందిన మణి గోవింద్ నుంచి 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో జైలుకు తరలించినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళలకు తీవ్ర గాయాలైనట్టు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన కాళ్ల కాంతం(64) స్థానిక పెద్ద చెరువు వద్దకు ఉపాధి పనికి వెళుతోంది. జాతీయ రహదారి దాటుతుండగా వైజాగ్ నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న లారీ ఆమెను ఢీకొంది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఆమె తలకు బలమైన గాయం కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మశీ రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు

గోకవరం: ఫార్మశీ రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు వాటిని అందిపుచ్చుకోవాలని విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నేత కంబాల శ్రీనివాసరావు అన్నారు. కొత్తపల్లి గ్రామంలో ఆదర్శ ఫార్మశీ కళాశాలలో ప్రయోగశాలలకు నోబెల్ బహుమతి అందుకున్న వ్యక్తుల పేర్లు పెట్టే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఫార్మా రంగంలో 30 సంవత్సరాలు పని చేసి జనరల్ మేనేజర్ స్థాయికి వెళ్లానన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పి.కనకరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ త్రినాథరావు, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.సుజని పాల్గొన్నారు.

విద్యార్థుల ఆలోచనలే రేపటి ప్రపంచం

- డాక్టర్ పి.చిరంజీవినీకుమారి



వార్షికోత్సవ వేడుకలో మాట్లాడుతున్న కరస్పాండెంట్ డాక్టర్ చిరంజీవినీకుమారి

బాలాజీచెరువు: విద్యార్థుల ఉన్నత ఆశయాలు, ఆలోచనలే రేపటి భవిష్యత్తు ప్రపంచమని ఐడియల్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి అన్నారు. స్థానిక సామర్లకోట రోడ్డులోని ఐడియల్ డిగ్రీ కళాశాలలో 2025 వార్షికోత్సవ వేడుకలు డాక్టర్ పి.చిరంజీవినీకుమారి ఆదేశాల మేరకు అకడమిక్ డైరెక్టర్ ఎమ్.రంజిత్ నేతృత్వంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ అధ్యక్షతన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి స్వాగతోపన్యాసం చేస్తూ విద్యార్థుల జీవితంలో కళాశాల సమయం ఎంతో విలువైనదని, నేర్చుకున్న పాఠాలు, సంస్కారం, ప్రవర్తన, క్రమశిక్షణ పైనే విద్యార్థులు సమాజంలో ఏవిధమైన పాత్ర పోషిస్తారనే విషయం అవగతమవుతుందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కాకినాడ అక్కా పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతి శ్రీ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని కృషి చేయాలన్నారు.మరో ముఖ్యఅతిథి కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు, న్యాయవాది అయ్యగారి వెంకటేష్ మాట్లాడుతూ ఈ కళాశాల నుంచి చదువుకున్నవారు వివిధ రంగాల్లో ఎంతో ఉన్నతస్థానంలో ఉన్నారని తెలిపారు. సభాధ్యక్షుడు డాక్టర్ టి. సత్యనారాయణ కళాశాల వార్షిక నివేదికను, ఫిజికల్ డైరెక్టర్ పి. శ్రీను క్రీడా నివేదికను సమర్పించారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ముఖ్య అతిథుల చేతుల మీదుగా నగదు బహుమతులు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.స్టీవెన్ రాజు, వి.నాగేశ్వరరావు, డాక్టర్ కె. స్వామీజీ, చింతపల్లి సుబ్బారావు, మాకినీడి. సూర్యభాస్కర్, వైఆర్ఎల్ చౌదరి, యు. నానిబాబు, గోపాల కృష్ణయాదవ్, విద్యార్థిని విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.